

# వరండా కుర్రాడు

సన్నగా, పొడుగ్గా ఉంటుంది రాధ. అలా అని చెప్పి ఈసురో ఘంటూ ఉండదు. సన్నటి నడుము, అక్కణ్ణుంచి ప్రారంభమయిన బలమైన కాళ్ళూ, ఆరోగ్యాన్ని సూచించే చెక్కిళ్ళు...ఆ అమ్మాయి అందమంతా ఆమె చలాకీ తనంలో ఉంది. పెళ్ళయి ఆరేళ్ళయినా ఆ హుషారు తగ్గలేదు సరి కదా మరెంతో పెరిగింది-అప్పుడే పిల్లలు వద్దనుకోవటంతో.

భర్త స్టేటు బ్యాంకులో బుల్లి ఆఫీసరు. అప్పుడేలోను తీసుకుని ఇల్లు కట్టేశారు కూడ.

ముచ్చటైె ఇల్లు, ముందు చిన్న గులాబీ తోట, ఇంటి ముందు వరండా, వరండాకి కుడివైపు సెపరేట్‌గా ఒక గది.

ఇల్లంతా నీట్‌గా ఉంచటం రాధ ప్రత్యేకత. భర్త ఆఫీసుకెళ్ళిన తర్వాత గది సర్దేసి ఏ పత్రికో పట్టుకుని చదువుతూ పడుకుంటుంది కొంత సేపు. రేడియో వినడం ఆమె హాబీ. ఆమె భర్తకి హాబీల్లేవు. అయిదున్నర కల్లా వచ్చేస్తాడు. తరువాత షికారుకో, సినిమాకో...చాలామంది అమ్మాయిలు తమ భవిష్యత్తు ఎలా ఉండాలని కోరుకుంటారో రాధ వర్తమానం అలాంటిది.

ఆ రోజు కూడా భర్త ఆఫీసుకు వెళ్ళిపోయాక అమె ఏదో వారపత్రిక చదువుతూ పడుకుని ఉండగా, తలుపు కొట్టిన చప్పుడయింది. ఈ వేళప్పుడు ఎవరు వచ్చారా అని ఆమె ఆశ్చర్యపడుతూ వెళ్ళి తలుపు తీసింది.

వరండాలో ఒక కుర్రవాడు నిలబడి ఉన్నాడు. కాలేజీ స్టూడెంటులా ఉన్నాడు.

"ఏం కావాలి?" అని అడిగింది రాధ కొద్దిగా భయపడి. ఆ లొకాలిటిలో ఇళ్ళు విసిరేసినట్లున్నాయి. ఎదురుగా నిలబడిన కుర్రవాడు రాష్‌గా రౌడీగా ఉన్నాడు. చేతిలో సిగరేట్ వెలుగుతూంది.

"మీ ఇంటిలో గది ఖాళీగా ఉందని మురారిగారు చెప్పారు."

మురారి భర్త ఆఫీసులో పని చేస్తున్నాడు. ముందుగది, దాని వెనుక వరండా గది ఎవరైనా కొత్త దంపతుల వస్తే కాస్త కాలక్షేపంగా ఉంటుందని రాధ భర్తకి చెప్పింది. ఇలాటి కుర్రవాణ్ణి పంపిస్తాడనుకోలేదు.

"గదులేం లేవు" అంది రాధ కటువుగా.

అతడు కదలకుండా, "అంటే మురారిగారు అబద్ధం చెప్పారా? అని అడిగాడు.

అతడు అలా నిలదీస్తున్నట్టు అడిగేసరికి ఆమెకు కోపం వచ్చింది. "...గదుల్లేవు. పోర్షనుంది" అంది దెబ్బకొట్టినట్టు.

"పర్లేదు ...పోర్షను మొత్తం నేనే తీసుకుంటాను" అన్నాడు.

"ఒంటరివాళ్ళ కివ్వం ..."

"నేను వంటరి వాడినని ఎవరన్నారు?"

"అంటే మీకు మ్యారేజీ అయిందా?"

"మ్యారేజి కాని వాళ్ళందరూ ఈ ప్రపంచంలో వంటరిగాళ్ళేనా-" అనేసి ఆ మాటలకి చివర ఒక నవ్వు కలిపాడు. ఆ నవ్వు 'తిరిగి దెబ్బ కొట్టాను సుమా" అన్నట్టు వుంది.

"సారీ..." అని చెప్పి రాధ తలుపు వేసింది. ఆ సాయంత్రం భర్తకి చెప్పి మురారిని చివాట్లు పెట్టిద్దామనుకుంది. కానీ-వస్తూ వస్తూ భర్తే అతన్ని తనతోపాటు తీసుకు వచ్చేసరికి అవాక్కు అయింది. ఆమె భర్తని లోపలికి పిలిచి ఏదో చెప్పబోయేంతలోనే-అతడు ఆ వచ్చిన కుర్రాడికి రెండు గదులూ చూపించటం, అతడు తలూపటం, అద్దె అడ్వాన్సుగా ఇవ్వటం జరిగిపోయినాయ్!

మరుసటి రోజు సామాన్లు తీసుకొచ్చి ఇంటిలో చేరిపోతానని చెప్పి ఆ అబ్బాయి

వెళ్లిపోయాక భర్తతో దెబ్బలాట వేసుకుంది. "ఇలాంటి స్టూడెంట్ కుర్రాళ్ళకి ఇవ్వడానికి ఇదేం లాడ్జింగ్ హౌస్ అనుకున్నారా?"

విశ్వనాథం తెల్లబోయాడు. "అదేమిటి రాధా! నువ్వేగా ఇంత పెద్ద ఇంటిలో ఉంటే తోచడం లేదూ అన్నావ్" అన్నాడు.

"అలా అని కాలేజీ కుర్రవాడిని తీసుకొచ్చి పెడతారా? ఎవరైన ఆడవాళ్ళుంటే మీరు ఆఫీసుకెళ్ళినప్పుడు కాస్త కబుర్లు చెప్పుకోవచ్చు కదా అనుకున్నాను" అంది,

ఆమెని అనునయించడానికి అతడు కొద్దిగా కష్టపడవలసి వచ్చింది. ఆమె అయిష్టంగానైనా ఒప్పుకోడానికి రాత్రి పదకొండు అయింది. స్వతహాగా విశ్వనాథం కంటే రాధ తన మాట నెగ్గించుకొంటుంది. అలా అని చెప్పి దురుసు మనిషీ కాదు. చాలా హుషారుగా ఉంటుంది. రాత్రిళ్ళు మరీనూ! ఒకోసారి ఆమె తాకిడికి అతడు తట్టుకోలేడు కూడా. మగవాడిని తృప్తిపరచడం ద్వారా డామినేట్ చేసిన భార్య - మిగతా అన్ని విషమాల్లోనూ పై చెయ్యిగా ఉండగలుగుతుంది. స్త్రీ ఫ్రిజిడ్‌గా ఉన్న కొద్దీ భర్త నిరంకుశుడూ, స్వార్థపరుడూ, ఇంటిని కంట్రోలు చెయ్యాలన్న కోర్కె పెరుగుతున్నవాడూ అవుతాడు. ఒక్కసారి అతడికి తృప్తి లభించటం మొదలు పెట్టిన తర్వాత తనంతట తానే ఆమెకు అధికారాన్ని అప్పగిస్తాడు. ఈ చిన్న సైకలాజికల్ పాయింటు ఆ భార్యాభర్తలకి తెలియకపోయినా జరుగుతున్నది అదే! దానివల్ల నష్టంలేదు సరికదా - ఆ దంపతులు చాలా సంతోషంగా ఉన్నారు. ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె భర్తని 'బుజ్జిబాబూ' అని పిలుస్తుంది. మరీ సంతోషం ఎక్కువైనప్పుడు ఇంకా చొరవ తీసుకుంటుంది. కానీ, ఇక్కడ వివరణ అప్రస్తుతం. "నువ్వేన్నయినా చెప్పు బుజ్జిబాబూ! నాకు ఆ హిప్పీ కుర్రాడు అస్సలు నచ్చలేదు" అంది. ఆ మాటల్లో ముందున్నంత కఠినత్వం లేకపోయేసరికి విశ్వనాథం సంతోషించాడు. అతడు మురారికి చాలా జనరస్‌గా వాగ్దానం ఇచ్చేశాడు అంతకుముందు రోజే!

సరిగ్గా పదకొండింటికి, మరుసటి రోజు ఆ కుర్రవాడు వచ్చి రూములో దిగాడు. ముందు ఒక కుక్క భౌ భౌ మని అరవటం వినిపించింది. ప్రహరీ దాటుకొని కుక్క లోపలికి ఎలా వచ్చిందా అని ఆమె ఆశ్చర్యపడి, చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి వెళ్ళి తలుపు తీసి చూసింది.

అతడిని వరండాలో చూసి, అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసింది.

"హల్లో" అన్నాడు అతడు. ఆమె చూస్తూంది అతనిని కాదు. ఒకటి -చేతిలో గొలుసు తెంపుకొనేటంతగా ప్రయత్నిస్తూ ముందు కాళ్ళ మీద గెంతుతూన్న బొచ్చుకుక్కని. రెండు- అతడి వెనుకే ఉన్న సామానుని. అంత సామానుతో ఒక నాలుగు కుటుంబాలు చాలా సులభంగా సంసారం చెయ్యొచ్చు. అయితే ఆ సామాను సంసారానికి పనికి వచ్చేదికాదు. అతడు నిలబడితే నడుమెత్తు వరకూ వచ్చే ఎత్తయినా స్టీరియో స్పీకర్లు అతడి వెనుక ఉన్నాయి. గిటారు ఆకారంలో జాయింటుగా ఉన్న పెట్టె ఉంది. నాలుగైదు పెద్ద పెద్ద ఫోటోలున్నాయి. పెద్ద భోషాణం లాంటి బాక్సు ఉంది. బట్టల మూటలో నుంచి రెండు మూడు జీన్స్ బైటికి వేలాడుతున్నాయి.

ఆమె నోరు తెరుచుకుని చూస్తున్నదల్లా అతడి మాటలకి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది - "కాస్త నా గది తలుపు లోపలికి వెళ్ళి తీస్తారా" అంటున్నాడు అతడు.

"ప్లీజ్ గో! వియ్ ఆర్ నాట్ ఇంటరెస్టెడ్ ఇన్ లెట్టింగ్" అని అరుద్దామన్న ప్రయత్నాన్ని అతి కష్టమ్మీద అణచుకుని లోపలికి వెళ్ళింది. బెడ్ రూమ్‌లోకి వెళ్ళి ఆ రూమ్‌లో నుంచి వరండా గది తలుపు తీయగానే అతడు లోపలికి వచ్చాడు. ఆ గదిలోనుంచి అతడు తమ పడగ్గదిలోకి తొంగి చూడకుండా తొందర తొందరగా ధడేలున మధ్య తలుపులు వేసేసింది. ఆమె కెందుకో ఒక్కసారిగా రోషమూ, ఎవరిమీదో తెలియని కసీ నీటిరూపంలో కళ్ళల్లో గిర్రున తిరిగాయి. తమ స్వేచ్ఛని ఎవరో బంధించినట్టు ఒక ఫీలింగ్ కలిగింది. అంతలో అతడు తన గదిలో సామాను పడెయ్యటం స్పష్టంగా వినిపించింది. స్పష్టంగా ప్రతీదీ... అంటే... తమ గదిలో ప్రతీ శబ్దమూ ఇలాగే స్పష్టంగా ఆ గదిలోకి వినిపిస్తుందన్న మాట !

టేబిల్ లాంప్‌ని విసిరికొడదామన్నంత కోపం వచ్చింది. అంతలో బైట తలుపుమీద చప్పుడు వినిపించింది. ఆమె బెడ్ రూమ్‌లో నుంచి బైట కొచ్చింది.

ఆ కుర్రాడే.

"ఎక్స్‌క్యూజ్ మి ! కొంచెం మంచినీళ్ళిస్తారా ?"

"ఇవ్వను" అని మొహంమీద తలుపు వేసేద్దామన్న కోర్కెను అతి బలవంతంమీద అణచుకుని లోపలికి వెళ్లి గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి అతడు అందుకోవటానికి చేయి సాచేలోపులో ... కిటికీలో పెట్టింది.

అతడు నీళ్ళు తాగుతూ "నా పేరు శంకర్--రవిశంకర్" అన్నాడు. అతడు నీళ్ళు తాగితే, మళ్ళీ ఆ గ్లాసు ఇవ్వడానికి ఇంకొకసారి తలుపు కొట్టకుండా, అప్పుడే గ్లాసుని లోపలికి తీసుకుపోదామని నిలబడింది. "మీ పేరు?" అని అడిగాడు.

"మిసెస్ వి. విశ్వనాథం" అంది కటువుగా.

తాగుతున్న నీళ్ళు పొలమారేటట్టు నవ్వాడు. "కంగ్రాచ్యులేషన్స్ ఫర్ యువర్ సెన్స్ ఆఫ్ ది పార్టీ ... మిసెస్ వి...వి...నాథం." ఒక అరవ శ్రీమతిని అభినందిస్తున్నట్టు అని, ఆ తరువాత తన గదిలోకి వెళ్ళి రాధకన్నా ముందే తన గది తలుపు వేసుకున్నాడు.

ఆ తరువాత అయిదు నిమిషాలయినా గడవకముందే అతడి గది స్పీకర్లలో నుంచి గిటారు వినిపించ సాగింది. చాలా మంచి ట్యూన్ అది. కాలేజీలో చదివే రోజుల్లో వుమెన్స్ కాలేజీనంతా ఒక వూపు వూపేసింది. ఆ రోజుల్లో ... వెంచర్స్ పాట ... ఎంత అందంగా ఈ కుర్రవాడు...

ఈ గోల భరించలేను. భర్త రాగానే చెప్పి ఖాళీ చేయించాలి. ఇది ఇల్లు అనుకుంటున్నాడా? నైట్ క్లబ్ అనుకుంటున్నాడా? డామిట్.

ఆమెని రక్షిస్తున్నట్టు అతడు తలుపు తాళం వేసుకుని వెళ్ళిపోయాడు. ఆమె హాయిగా వూపిరి పీల్చుకుంది.

అప్పుడు వెళ్ళినవాడు సాయంత్రం అయిదింటి వరకూ రాకపోయేసరికి ఇక అతడి

గురించి తాత్కాలికంగా మర్చిపోయింది. అయినా అటువంటి కుర్రాళ్ళు రాత్రి పదకొండింటి లోపులో ఇంటికి ఎప్పుడు చేరుకుంటారు గనక.

అయిదున్నర వరకూ భర్త కోసం చూసి, తలుపు దగ్గరగా జారేసి ఆమె స్నానానికి వెళ్ళింది. రెండు నిమిషాలకి భర్త వచ్చిన అలికిడి అయింది. "వచ్చేస్తున్నా - నే నొచ్చి కాఫీ ఇస్తా! మీరా వంటింటిలో ఏమీ కెలక్కండి" అంది. విశ్వనాథం బుద్ధిమంతుడు. గొడవ చెయ్యడు. ఆమె కెందుకో అకస్మాత్తుగా భర్తని చిలిపిగా ఏడిపించాలని బుద్ధి పుట్టింది. కుచ్చిళ్ళు సర్దుకుని బాత్‌రూమ్ తలుపుతీస్తూ "మీరు చెయ్యల్సిన పన్లన్నీ నన్ను చెయ్యమని వేపుకుతింటారు చూడండి- ఒకటే ఒళ్ళు నొప్పులు" అంటూ బైటకొచ్చింది ఇలా అల్లరి చెయ్యటం ఆమెకి బాగా అలవాటు. విశ్వనాథానికి ఇష్టం కూడా.

కానీ దురదృష్టవశాత్తూ అతడు కాదు ఆ గదిలో ఉంది ఆమె విన్న అలికిడి ముందు హాల్లో శంకర్‌ది అతడి చేతిలో కూజా ఉంది.

భూమి రెండుగా చీలిపోయి తను అందులో కూరుకుపోతేబావుణ్ను అన్న భావన కలిగిందామెకి. అంత చూసుకోకుండా మాట్లాడేసినందుకు తనమీద తనకే కోపం వచ్చింది. అతడి మొహంలో కనపడనట్టు కదలాడిన చిరునవ్వు ఆమెకి మరింత కోపాన్నీ, ఉక్రోషాన్నీ కలిగించింది. పొంత యిల్లు అయినట్టు అలా లోపలికి వచ్చి కూర్చొని తమ రహస్య జీవితంలో ప్రవేశించటం ఏమిటి- పైగా ఆ రహస్యాన్ని కనుక్కున్నట్టు నవ్వేమిటి ? ... ఇడియెట్.

ఆ రోజంతా ఆమెకి ఏమీ తోచలేదు. ఏవరి మీదో అకారణంగా కోపం వస్తూంది. ఆ కుర్రవాణ్ని ఎలా అయినా గది ఖాళీ చేయించాలన్న కోర్కె క్షణక్షణానికి బలంగా పెరుగుతూంది. వీలైతే ఈరోజు భర్త మీద నిరాహారదీక్ష ప్రకటించాలని కూడా అనుకుంది.

ఆమె కోపానికి మరింత ఆజ్యం పోస్తున్నట్టుగా రవి శంకర్ ఆ రోజు గది వదలి వెళ్ళలేదు. పైగా డ్రమ్స్ వేసుక్కూర్చున్నాడు. మద్దెల వాయిస్తున్నట్టు వాటిమీదనుంచి వచ్చే 'దబ్ దబ్' శబ్దానికి ఆ ఇంటిగోడలు ప్రతిధ్వనించసాగాయి.

సాయంత్రం ఆరయింది భర్త ఇంకా రాలేదు. రాధ కాలు కాలిన పిల్లిలా హాల్లో పచార్లు చేయసాగింది. గదిలో అతడు డ్రమ్స్ మీద కొడుతున్న బీట్స్ ఆమెకి తన గుండెలమీద కొడుతున్నట్టే వుంది. కొంచెంసేపయ్యాక ఇక కోపం ఆపుకోలేక తనే వెళ్ళి అతడిని నాలుగూ దులిపేద్దామన్న ఉద్దేశ్యంతో అతడి గది దగ్గరికి వెళ్ళింది. వేసివున్న తలుపు కొట్టబోయి-పక్క కిటికీలోంచి లోపలికి చూసింది.

అంతే !

ఆమె ఒంటినిండా ఒక్కసారిగా చెమట పట్టింది. కాళ్ళు వణకసాగాయి. గిటారు పక్కనే గ్లాసులో పచ్చటిద్రవం మిల మిలా మెరుస్తూ కనబడుతూంది. వాయిస్తూ వాయిస్తూ మధ్యలో దాన్ని తీసుకుని ఒక్క గుక్క లాగి పక్కన పెట్టి తన పనిలో నిమగ్నమవుతున్నాడు. ఈ ప్రపంచం అంతా తనదే అన్నంత ధీమాగా ఆ సాయంత్రాన్ని అనుభవిస్తున్నాడు.

ఆమె గాలిలా వచ్చి తన బెడ్‌రూమ్‌లో పక్కమీద వాలిపోయింది. డ్రింక్ చేయటం ఆమెకి కొత్తకారు. భర్త బ్యాంకులో ఏవైనా ఫంక్షన్సు జరిగినప్పుడు ఒకటి రెండు పెగ్‌లు తాగి

రావటం అలవాటే ఏదో అనాలి కాబట్టి చిరాకుపడేది కానీ-ఆమెకీ అంతర్గతంగా అతడు 'అప్పుడప్పుడు' అలా రావటం ఇష్టంగానే ఉండేది. అలా వచ్చినప్పుడు మామూలుకన్నా ఎక్కువ ఎనర్జీతో అతడు మేల్కొని ఉండేవాడు. నిజానికి అప్పుడే అతడు ఆమెకి సమానస్థాయిలో ఉండేవాడు. కానీ ఇదేమిటి ? ఇది ఇల్లా-సత్రమా? ఇంటిలోనే ఈ కుర్రవాడు బ్రాందీషాపు పెట్టేశాడు. ఇంకా నయం తనే ముందు చూసింది కాబట్టి సరిపోయింది. కానీ తమింటికి ఏ బంధువులో వచ్చినప్పుడు ఈ విషయం బైటపడి ఉంటే ఏమై ఉండేది ?

ఆమెకి హఠాత్తుగా మరో విషయం జ్ఞాపకం వచ్చి వళ్ళు గగుర్పొడిచింది.

ఇంటిలో తమిద్దరే ఉన్నారు. అతడు తాగి ఉన్నాడు.

బైటంతా చీకటి.

టైమ్ ఏడు కావస్తూంది !

విసిరేసినట్టు ఇళ్ళున్న ఆ కాలనీలో ... ఒక ఇంటిలో ఏం జరిగినా ఇంకో ఇంటివాళ్ళకి అసలు తెలీదు. ఆమె కిటికీ తెర తొలగించి ఎదురింటివైపు చూసింది. ఎదురింటి పరంధామయ్య ఇటే చూస్తున్నాడు. అతడు రిటైరయి సంవత్సరం కావస్తూంది. ఎప్పుడు రాధ బైటకొస్తుందా అని చూడటమే ప్రస్తుతం అతడి వ్యాపకం. ఆమె విసుగ్గా కిటికీ మూసేసింది. ఆమెకి భర్తమీద కోపం వచ్చింది. ఇంత రాత్రివరకూ అతడేం చేస్తున్నాడు ?

చేతికందిన ఏదో పుస్తకం తీసుకుని ఆమె చదవటం ప్రారంభించింది. భర్త తొందరగా వస్తే సెకెండ్ షోకి వెళ్దామని ఆమె అనుకుంది. కానీ అతడిప్పుడప్పుడే వచ్చే సూచనలు కనబడటం లేదు.

ఆమె చదువుతున్నది ఒక ప్రేమ నవల. హీరో మాటి మాటికీ హీరోయిన్‌ని రెక్క పట్టుకుని దగ్గిరకు లాక్కుంటున్నాడే తప్ప ఇంకేమీ చెయ్యటంలేదు. హీరోయిన్ రోషంగా హీరో వైపు చూస్తూందే తప్ప మనసులో మాట చెప్పటం లేదు. ఇద్దరిలో ఏ ఒక్కరు అది చేసినా నవల పూర్తయి ఉండేది. చెయ్యకపోబట్టి మూడొందలు పేజీల్నుంచి సాగుతూంది.

--ఏదైనా పుస్తకం చదివేటప్పుడు బోర్లా పడుకుని, రొమ్ముల క్రింద దిండు పెట్టుకుని కాళ్ళు గాలిలో వూపుతూ చిన్న పిల్లలా చదవటం ఆమెకి అలవాటు. అలా చదువుతూ తలుపు చెక్క వైపు మామూలుగా ఆమె తల తిప్పి చూసింది తమ గదికీ, అతడి గదికీ మధ్య నున్న తలుపు అది !

చప్పున ఏదో అనుమానం వచ్చి ఆమె తలుపు దగ్గిరకి వెళ్ళింది. చూడటానికి తలుపుకి కన్నాలు ఏమైనా ఉన్నాయేమోనని పరీక్షించింది. ఆమె గుండె ఆగినంత పని అయింది. కుడివైపు రెండు చెక్కలూ కలిసే చోట చిన్న రంధ్రం ఉంది. ఆమె అవతలి గదిలోకి చూసి షాక్ తగిలిన దాన్లా వెనక్కి జరిగింది. ఆమె మొహం ఎఱ్ఱగా కందిపోయింది. లైట్ ఆర్పేసి ముందు గదిలోకి వచ్చి సోఫాలో కూర్చుంది. తన గుండె చప్పుడు తనకే విన్పిస్తూంది. సర్దుకోవటానికి కొంచెం సేపు పట్టింది. ఇంకానయం. దీని సంగతి తనే ముందు గమనించింది లేకపోతే...రాత్రి చాలా సేపటి వరకూ లైటు వేసుకొని ఉండే తమ అలవాటుతో ... ఛా ... ఆపైన మరి ఆలోచించలేకపోయింది.

కొవ్వొత్తి తాలూకు మైనం లోపల్నుంచి తీసుకొచ్చి ఆ రంధ్రాన్ని మూస్తుంటే ఇంతలో తలుపు కొట్టిన చప్పుడయింది. భర్తేమో అనుకుని ఆమె తొందర తొందరగా వెళ్ళి తీసింది. కానీ-అతడు. ఆమె అడుగు వెనక్కి వేసి కటువుగా, "ఏం కావాలి ?" అపి అడిగిందిజ

"నా కోసం ఎవరన్నా వస్తే రూమ్‌లో కూర్చోమనండి. అరగంటలో వస్తాను. పెయింట్ ట్యూబ్స్ అయిపోయాయి. ఇదిగో తాళంచెవి" అని ఆమె ఏదో అనబోయే లోపులో తాళంచెవి ఆమె చేతుల్లో పెట్టి మెట్లు దిగి వెళ్ళిపోయాడు. ఇదంతా వేషం అని ఆమెకి తెలుసు. తనో పెయింటర్‌ని అని తెలియ చెప్పాలనే ఆ ప్రయత్నం. తాళంచెవి ఇచ్చే మిషమీద తనని లోపల్నించి పిలవటం కోసం అదో ఎత్తు. అన్నిటికన్నా ముఖ్యంగా కీ అందించేటప్పుడు కావాలని చెయ్యి తాకించటం...

అతడి మీద ఆమెకి ద్వేషం క్షణక్షణానికీ పెరిగిపోతూంది. అతడు వచ్చి ఇంకా పూర్తిగా ఇరవై నాలుగు గంటలు కాలేదు. ఇంత తక్కువ సమయంలో ఎన్నో సంఘటనలు...జరిగినవన్నీ ఆమెని ఇరుకునపెట్టేవే. ఆలోచనల్తో ఆమె నిద్రలోకి జారుకుంది. అప్పటికి తొమ్మిది కాలేదు. అకస్మాత్తుగా చప్పుడయి నిద్రలోంచి మేలుకుంది. అతడు లోపలికి వస్తూ "తాళంచెవి" అన్నాడు. ఆమె లేవబోయింది కానీ...

అతడు దగ్గిరకి రాసాగాడు. అతడి ఉద్దేశ్యాన్ని గ్రహించి ఆమె భయభ్రాంతురాలైంది. కిటికీ మీద పెట్టిన తాళంచెవిని అతడు చూశాడు. కానీ, అటు వెళ్ళటం లేదు. ఆమె అరవబోయింది. నోట మాట రాలేదు. ఈ లోపులో అతడు దగ్గిరగా వచ్చి ఆమె భుజాల్ని రెండు చేతుల్తోనూ పట్టుకుని దగ్గిరకి తీసుకున్నాడు. అందులో భయంలేదు. ఆమె తన వస్తువు అయినట్టు ఆమెమీద తన కెప్పట్నుంచో అధికారం ఉన్నట్టు ఆమెని పైకి లేపాడు. సర్వశక్తులూ కూడగట్టుకుని గింజుకుంటూ ఆమె అరవటానికి ప్రయత్నించింది. కానీ అంతలో అతడి పెదవులు ఆమె నోటిని మూసేశాయి. అతడి దృఢత్వం ముందూ, బలం ముందూ ఆమె ఆటబొమ్మ అవుతూంది. ఆమెనుంచి విడవడకుండానే మోకాళ్ళ క్రింద చెయ్యివేసి ఆమెని గాలిలోకి లేపి మంచం మీదకు పడేశాడు. ఆమె స్ప్రింగ్‌లాగా లేవబోయింది. అది గ్రహించనట్టు చేతితో నొక్కిపట్టి ఆమెని పూర్తిగా అక్రమించుకున్నాడు.

నిస్సహాయత నిండినకంఠంతో ఆమె "వదులు--వదులు" అన్నది. అతడు వినిపించుకోలేదు. అతడి చెయ్యి ఆమె నడుము వంపులోంచి క్రిందికి జారింది. అతడి మొహం మెడవంపు నుంచి క్రిందికి దిగింది. దాంతో షాక్ తగిలినట్టయి, ఆ జలదరింపులోనే పక్కకి తిరగటానికి ప్రయత్నించి, ఆ ప్రయత్నంలో అతడి వంటికి మరింత దగ్గరయింది. ఇప్పుడు ఆమె ప్రతీ అంగానికీ తన ఉనికి తెలుస్తూంది. ప్రతీ అవయవమూ మెదడుకి తరంగాలు తరంగాలుగా కమ్యూనికేషన్ పంపుతూంది. చల్లటి షవర్ నాలుగు వైపుల్నుంచీ ఒక్కసారిగా వంటిమీదకు జాలువారిన అనుభూతితో శరీరం వణికింది. ఏదో అఖాతం నుంచి శరీరం గాలిలో పైకి తేలిపోతూంది. అయితే అదంతా క్షణిక మాత్రామే! క్షణంలో ఆమె తెప్పరిల్లింది. అతడి మెడచుట్టూ పెనవేసుకున్న చేతుల్ని తన స్వాదీనంలోకి తెచ్చుకుని, బలముగా అతడిని తోసేసింది. అతడు గాలిలో అదృశ్యమై పోయాడు. ఆమెకు దుఃఖం వచ్చింది. తన దిండులో మొహం దాచుకుని వెక్కి వెక్కి రోదించసాగింది.

అంతలో బైట తలుపు చప్పుడయింది.

ఆమె కళ్ళు విప్పింది. నలగని పక్క చెదిరిన కలని పరిహసించింది. వెళ్ళి తలుపు గడియ తీసింది. విశ్వనాథం నవ్వుతూ "ఏమిటి... అప్పుడే నిద్రపోయావు ? ఎంత సేపట్నుంచి తలుపు తడుతున్నానో తెలుసా ?" అన్నాడు. ఆమె జవాబు ఇవ్వలేదు. ఈ లోపులో తిరిగి గేటు దగ్గిర చప్పుడయింది. రవిశంకర్ వస్తున్నాడు. ఆమె చప్పున కిటికీ దగ్గిర పెట్టిన తాళంచెవిని భర్తకి ఇస్తూ, "ఇది అతడి కివ్వండి. ఇలా అర్ధరాత్రి పూటా, తెల్లవారు జామునా వస్తే కుదరదని చెప్పండి" అంది. ఆ మాటలు అతడికి వినిపిస్తాయని ఆమెకి తెలుసు. వినిపించాయికూడా! అతడు మాట్లాడకుండా కీ తీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు. విశ్వనాథం భార్యవైపు చిత్రంగా చూసి, లోపలికి నడిచాడు ఆమె భర్తని అనుసరించింది.

ఆ రాత్రి ఆమె ఆ ప్రసక్తి ఎత్తలేదు కానీ, మరుసటి రోజు భర్త ఆఫీసుకు వెళ్ళబోతూ భోజనం చేస్తూ ఉండగా "మీ రెటాగైనా ఆ కుర్రాడి చేత గది ఖాళీ చేయించాల్సిందే" అంది.

మజ్జిగ కంచంలో పోసుకుంటూ విశ్వనాథం "ఎందుకు?" అని అడిగాడు.

"నా కిష్టం లేదంతే."

"అదే ఎందుకూ అని అడుగుతున్నాను."

ఆమె వెంటనే జవాబు చెప్పలేకపోయింది.

"అతడు నిన్నా, ఈ వేళా నీ పట్ల ఏమైనా చౌకబారుగా ప్రవర్తించాడా?"

ఆమె మాట్లాడలేదు.

"ఇంతకీ నువ్వు అంటున్నది అతడిని గది ఖాళీ చేయించి ఇంకెవరికైనా ఇద్దామనా ? లేక అసలెవరికీ ఇవ్వవద్దనా ?

"ఇంకెవరికైనా ఇద్దాం."

"ఇతడిని వెళిపొమ్మనటానికి సరి అయిన కారణం ఉండాలికదా?"

ఆమె సమాధానం చెప్పలేదు. అతడు భోజనం పూర్తిచేసి వక్కపొడి వేసుకొని స్కూటర్ తాళాలు తీసుకుంటూ అన్నాడు- "రాధా! నేను నీలాగా సాహిత్యాన్నీ, మనుష్యుల మనసుల్నీ చదివినవాడిని కాదు. నాకు చెప్పటం సరీగ్గా రాదు. నిన్నటినుంచీ నిన్ను చూస్తున్నాను. నువ్వు ఒక రకమైన అబ్‌సెషన్‌తో బాధపడుతున్నావేమోనని నా ఉద్దేశ్యం. ఈ ప్రపంచంలో ఏ మనిషీ చెడ్డవాడు కాదు. అంతా మనం అనుకోవడంలో ఉంటుంది. ప్రపంచం అంతా అంటుంది కాబట్టి మనమూ అలాటి దృక్పథాన్ని ఏర్పర్చుకోవాలని రూలేం లేదు. మనం ఏ కోణంలోంచి అవతలి వ్యక్తిని చూస్తామో ఆ కోణంలోనే అతడు కనబడతాడు. స్త్రీ అంటే పురుషుడికి భయపడాలి- కనీసం భయపడుతున్నట్టు నటించాలి. దూరంగా ఉండాలి అన్న మానసిక వ్యాధితో నువ్వు భయపడుతున్నావేమో అని నా అనుమానం. నీ ఇన్‌హిబిషన్స్ నుంచి ఒక్కసారి బైటకు రావటానికి ప్రయత్నించు. నీ కంటికి కనబడేదీ - దాని ఆధారంగా నువ్వు వూహించుకొనేదీ నిజం కాకపోవచ్చు. ఒకవేళ నిజం అయితే తప్పకుండా అతడిచేత గది ఖాళీ చేయిద్దాం. కానీ, నీ తరపునుంచి ప్రయత్నం చెయ్యకుండా ఒక నిర్ణయానికి రావటం తప్పని నా అభిప్రాయం" అని ఆఫీసుకి వెళ్ళి పోయాడు.

ఆమె చిత్తరువులా నిలబడిపోయింది. భర్త ఇలా మాట్లాడటం ఆమెకు షాకు అసలు భర్తలో ఇంత అనలిటికల్ పవర్ ఉంది అని ఆమె అనుకోలేదు కూడా. అతడు తననీ, తన ఘర్షణనీ ఇంతలా గమనిస్తున్నాడనేది ఆమెకి కొత్త విషయం. ఇక్కడ మరో విషయం కూడా గమనించాలి. ఆమె కూడా మూర్ఖపు పట్టుదల ఉన్న మనిషేంకాదు. భర్త అలా మాట్లాడగానే కొద్దిసేపు ఆవేశపడింది కానీ, తరువాత అందులో లాజిక్ ఆలోచించింది. ఆలోచించేకొద్దీ తను తీసుకున్న ఒక పక్షపు నిర్ణయాలు ఎంత అర్థరహితమైనవో తెలిసి సిగ్గేసింది.

అప్పటికింకా పది అవలేదు. రవిశంకర్ తన గదిలోనే ఉన్నాడు.

"లోపలికి రావచ్చా ?" అందామె, తలుపు దగ్గిర నిలబడింది.

అలా ఆమెని వూహించని అతడు కొద్దిగా విస్మయం చెందినా- ఆమె కంఠంలో ఏ విధమైన విసుగూ, కోపమూ కనిపించకపోయేసరికి ఉత్సాహంతో- "రండి...రండి" అన్నాడు. ఆమె లోపలికి అడుగు పెట్టి- అతడు వేస్తున్న బొమ్మవైపు చూసింది- ఆమెకి రంగుల మిశ్రమం గురించి ఏమీ తెలీదు గానీ ఏమీ తెలియని వాళ్ళకి కూడా బావుండేటంతగా బావుంది ఆ బొమ్మ.

"మీ రెక్కడ చదువుతున్నారు ?" అని అడిగింది.

"యూనివర్సిటీ నైట్ కాలేజీలో..." అన్నాడు. "అదేగాక ఒక కమర్షియల్ కంపెనీలో పార్టుటైం పని చేస్తున్నాను."

ఆమె అతడివైపు పరీక్షగా చూసింది. తనకన్నా రెండు మూడేళ్ళు చిన్నవాడేయో ! బుగ్గలో పాలదనం ఇంకా పోలేదు. రఫ్‌గా కనబడాలని కొద్దిగా గడ్డమూ, సైడ్‌లాక్సూ పెంచినట్టు ఉన్నాడు. ఆమెకు నవ్వొచ్చింది. తమ ఊర్లో చదువుకుంటున్న తమ్ముడు గుర్తొచ్చాడు. వాడూ ఇతనిలాగే వయసుకన్నా పెద్దగ్గా కనబడాలని విశ్వప్రయత్నం చేస్తూ వుంటాడు. ఆమె దృష్టి గిటారూ, డ్రమ్స్‌మీద పడటంతో అతడు ఇబ్బందిగా నవ్వి, "తెల్లవారుజమునే మీ నిద్ర డిస్టర్బ్ చేస్తున్నానా ?" అని అడిగాడు.

"లేదు-- లేదు" అందామె. "మీరు ఎప్పుడు నిద్ర లేస్తున్నారో కూడా మాకు తెలియదు.'

"తెల్లవార్నే సాధన చేస్తే బావుంటుంది - అందుకే నాలుగింటికల్లా లేచిపోతాను."

అకస్మాత్తుగా థర్డ్ డైమెన్షన్‌లో ఏదో కిటికీ రెక్క తెరుచుకుని ఒక్కసారిగా వెలుగు ప్రవహించినట్టు అనిపించిందామెకు. భర్త మాటలు జ్ఞాపకం వచ్చాయి. కొంతమంది పైకి ఎంతో మంచివాళ్ళుగా, అమాయకులుగా కనబడతారు. కొందమంది రఫ్‌గా, జీవితంపట్ల లక్ష్యం లేనివారుగా కనబడతారు. కానీ, తెరిచి చూస్తే ఎంత వైవిధ్యం. ఎప్పుడూ సిగరెట్ తాగుతూ, రాత్రి అవగానే బాటిల్ విప్పే ఈ కుర్రవాడు తమందరికన్నా రెండు రెట్లు ఎక్కువ పని చేస్తాడు. జీవితం పట్ల ఒక నిర్దిష్టమైన అభిప్రాయం, జీవితంలో ఒక గమ్యం వున్నవాడు ! గమ్యం వుండటం వేరు. దాన్ని సాధించటం కోసం కష్టపడటం వేరు. ఆ కష్టపడటంలో అతడికి సాటి ప్రపంచం మీద ఒక రకమైన నిరాసక్తత, నిర్లక్ష్యం ఏర్పడి వుండవచ్చు. దాన్ని అర్థం చేసుకోలేకపోవటం తమ తప్పు. ఒక్కసారి ఈ కమ్యూనికేషన్ గాప్‌ని బద్దలుకొట్టేసరికి

ఆమెకి అంతా మంచు విడిపోయినట్టు విడిపోయింది.

"రేపు ఆదివారం. ఆయన కూడా వుంటారు- మా ఇంటికి లంచ్‌కి రావాలి" అంది.

అతడు మొహంలో ఆనందాన్ని ఏ మాత్రం దాచుకొనే ప్రయత్నం చెయ్యకుండా- "తప్పకుండా! మంచి భోజనం కోసం మొహం వాచి పోయాను" అన్నాడు స్వచ్ఛమైన నవ్వుతో.

❁ ❁ ❁

**- దుప్పట్లో మిన్నాగు (1987)**